# వైద్యుని ఆత్మకథ

## —తటవర్తి రామచంద్రరావు

ఆదివారం. మబ్బు తెరల్ని చుట్ట బెట్టుకున్న ఆకాశం....

గబుక్కున లేచి చూస్తే గడియారంలో ఎనిమిది దాటింది. రాత్రి వేసిన తలుపు గడియ అలాగే వుంది. అంటే, మాణిక్యం రాలేదన్నమాట! ప్రొద్దున్నే మాణిక్యం తలుపు తట్టటం.... నేను నిద్ర కళ్ళతో వెళ్ళి తలుపు తీయటం రోజూ జరిగేదే! అంట్లు తోమి, ఇల్లంతా తుడిచి, తను వాడిగ్గా తెచ్చే పాలు కాచి పెట్టి, "ఇంక లేవండి బాబూ!" అని ఓ కేకపెట్టి వెళ్ళి పోతుంది రోజూ. ప్రళయం వచ్చి పడిపోతున్నా....ఆమె దిన చర్యలో మాత్రం మార్పుండదు.

కాని, ఇవేళ మాణిక్యం రాలేదు. ఇంక పాలు వచ్చే అవకాశమూ లేదు.... రెండు రోజులుగా విపరీతమయిన వర్షం కురుస్తోంది. బహుశ వర్షంలో తడిసిందేమో! పాపం, ఏ జ్వరమయినా వచ్చిందేమో!.... ఆమె రాలేదు. ఇక ఈ పూట ఏ హోటలుకో పోవాల్సిందే!

"ఈ వర్షంలో ఇక్కడ ఎంతసేపు నుంచుంటాం. మీ కభ్యంతరం లేకపోతే రిక్షాలో వెళ్ళిపోదాం రండి" అని నేనంటే సుధారాణి చిరునవ్వుతో సరేనంది. రిక్షా తెరల్ని చించుకుంటూ మీద పడిన చినుకులతో ఆమె ఒళ్ళు తడిసినప్పుడు 'అరెరే, మీరు తడిసిపోతున్నారు' అని నేనంటే నా వైపు చూసి నవ్వింది.

'మీరు తడుస్తున్నారుగా' అని ఆమె చిరునవ్వు చెప్పినట్టనిపించింది. వాన జల్లుకి తడిసిన ఒళ్ళు ఆమె నవ్వుల పులకరింపుతో జల్లుమంది. రిక్షా కుదిపింది. భుజాలు రాసుకున్నాయి. నరాలు జివ్వుమన్నాయి. గుండెల్లో పులకరింత. ఒళ్ళంతా ఏదో హాయి. గొంతులో గుటక వేసుకుంటున్న తేనెలాంటి మధురిమ....ఆమె మధ్యలో దిగి వెళ్ళి



పోయింది. తియ్యని కల చెదిరి పోయినట్టయింది.

క్రితం సాయంత్రం మధురానుభవం కలిగించిన తియ్యని అనుభూతులతో రాత్రి చాలసేపటివరకు నిద్ర పట్టలేదు..........ఇప్పుడొక్కసారిగా అదంతా గుర్తుకు వచ్చింది.

సుధారాణికీ నాకూ ఏడాదినుంచీ పరిచయం. ఎదురెదురు సీట్లు. ఆఫీసు కబుర్లే కాదు. అవీ యివీ ఎన్నో మాట్లాడుకుంటాము. ఇంతవరకూ మామధ్య రాని ప్రస్తావన ఒక్క ఈ-

అదే ప్రేమ, పెళ్ళి: 'ఎలిజిబుల్ బేచిలెర్‌వి. అడుగు, కాదనదు' అని ఫ్రెండ్స్ అంటుంటారు. ఆమె కిష్టమవునో కాదో....అని నేను సందేహిస్తుంటే- 'ఇష్టంకాకపోతే నీతో అంత చనువుగా ఉంటుందా! మీన మేషాలు లెక్కిస్తూ కూర్చుంటే.....అందమయిన అమ్మాయినే కాదు, ఆమె సంపాదించే పర్సును కూడా ఎవడో తన్నుకుపోతాడు. 'నాకేం'అని'.... నా మనస్సు కూడ ఈ మధ్య బాగా బెదిరిస్తోంది.

నిన్న సాయంత్రంవాన. నేను రమ్మనగానే ఆమె రిక్షాలో రావటం, ఆ వెచ్చని స్పర్శ, ఆ చిరునవ్వులు, ఆ కళ్ళల్లోని వెన్నెల- నేను అడగాలనుకున్న ప్రశ్నలకు జవాబులు చెప్పినట్టనిపిస్తున్నాయి! ఇంకే సంగతి ముఖతః ఆమెను అడక్కపోతే నా మనస్సు నాలో నిలిచేలా లేదు. కాని, ఎలా అడగాలి? ఎక్కడ కలిసి అడగాలి? పోనీ ఒక ప్రేమ లేఖ రాస్తే? ఏం చేస్తే మంచిది...ఎవరయినా సలహా చెపితే బావుణ్ను!

చటుక్కున శ్యాంబాబు గుర్తుకు వచ్చాడు! శ్యాం కాలేజీనాటినుంచీ నాకు బెస్టు ఫ్రెండు. ఎల్ఐసి ఆఫీసులో పని. మంచి భావుకుడేకాదు, నాల్గయిదేళ్ళుగా పత్రికల్లో విరివిగా కథలు పడుతున్న రచయిత! ముఖకవళికల్ని చూసి మనస్సు చదవగలడు. అనుభవాన్ని బట్టి అంతర్యాన్ని గుర్తించగలడు.

ఆ ఆలోచన వచ్చినదే తడవు.... నాలుగు చెంబులు నీళ్ళు మీద దిమ్మరించుకొని, ఆదరాబాదరాగా బట్ట లేసుకొని వీధిలో పడ్డాను.

వర్షం తగ్గిందికాని....వీధుల్లో ప్రవహిస్తున్న వరదమాత్రం తగ్గలేదు. హోటల్లో టిఫినుచేసి శ్యాంబాబు రూముకి చేరేసరికి పదికావస్తోంది. వాడింకా మంచంమీద పడుకోవటం చూసి తెల్లబోయాను.

"ఏం లేదురా! ఊరికి నే...."అంటూ పైకి లేచాడు. వాడి ముఖం వాడిపోయింది.

వాడి ఒళ్ళు పట్టుకుచూసి "ఏంలేదంటావేమిటి? జ్వరం వుంటేను" అన్నాను.

"నువ్వొచ్చావుగా! ఇంక జ్వరం తగ్గిపోతుందిలే!" అని నవ్వాడు.

"ఎప్పట్నించి?"

"అబ్బే, ప్రొద్దున్నే. మామూలు జ్వరమే! మాత్ర వేసుకున్నానులే!"

"ఇవేళ ఎందుకో మరి మా మాణిక్యం రాలేదు. అంట్లూ గింట్లూ అలాగే పడున్నాయి. ఇక్కడ తిందామని వస్తే...."అని నవ్వాను.

"వద్దు-వద్దన్నా మా సత్తెమ్మ స్టవ్ మీద కుక్కరు పెట్టి వెళ్ళిపోయింది. మరి కాసేపట్లో ఉడుకుతుంది. దింపుకుని తిను....ఆవకాయ, పెరుగు ఉన్నాయి. ఓపికుంటే బంగాళా దుంపలు వేయించు. తినాలనిపిస్తే నేనూ తయారవుతాను."

"మీ అమ్మగారు వూర్నుంచి ఎప్పుడు వస్తారు?" అని అడిగాను.

"నేడో, రేపో రావాలి....ఏమిటి కబుర్లు?"

'మీ సుధారాణి కబుర్లు చెప్పు'-అని వాడడిగి నట్టనిపించింది. వారానికి కనీసం రెండుసార్లయినా కల్సుకుంటాము వాడూ నేనూ. అయినా, యింతవరకూ ఆమె సంగతి వాడితో నేను చెప్పలేదు. సిగ్గు కొంత. ఇంకా ఆమె మనస్సు తెల్సుకోలేదని మరి కొంత. అందుకనే ఇంత కాలంగా వాడికి చెప్పలేదు.... నిన్నటి అనుభవం తర్వాత యిక సంగతి చెప్పి వాడి సలహా తీసుకోవటం మంచిదనిపించింది,

"ఏమున్నాయి? వాన... వరద" అంటూ నవ్వేశాను. ఆ క్షణంలో సుధారాణి కన్నుల్లోంచి కురిసే వెన్నెలవాన, నా మనసులోని అనుభూతుల వరద తప్ప వాస్తవంలోని వాన-వరద నాకు స్పృహలో లేవు. కుక్కరు గీపెట్టింది. "నీ అన్నం తయారు" అన్నాడు శ్యాం. కుక్కరు క్రిందకి దింపి స్టవ్ ఆర్పేసి వచ్చాను.

"మరి అన్నం తినవా?" అని అడిగాడు శ్యాం....టీపాయ్ మీద ఏవో కాగితాలు సర్దుతూ.

"హోటల్లో టిఫిను తినే బయలుదేరాను....ఏమిటది? కొత్తగా ఏదో రాసినట్టున్నావు?" అన్నాను.

తల వూపి నవ్వాడు శ్యాం.

"ఏదయినా లవ్ స్టోరియా?" అన్నాను ఆ కాగితాలు అందుకుంటూ.

ఎందుకో వాడి ముఖం సీరియస్‌గా అయిపోయింది. "నువ్వనుకునే లవ్ స్టోరీ కాదురా!" అన్నాడు గంభీరంగా.

"ఏదయితే నేం? నువ్వు వ్రాసే ప్రతి కథా నాకు బావుంటుంది...." అంటూ వాడి చేతిలోని కాగితాలు అందుకున్నాను. ఇంకా కథకి వాడు పేరు పెట్టలేదు. మొదటి పేజీపైన తేదీ వేసి వుంది. అది శ్యాం అలవాటు. "....అంటే, నిన్ననే రాసావన్నమాట?" అన్నాను.

"అవును. రాత్రి పూర్తి చేసేసరికి ఒంటిగంటయింది!" వాడి ముఖంలో గంభీరత వుంది. అయినా ఏదో కాంతి వుంది.

కథ చదవటం మొదలుపెట్టాను....

వాన....వరద....ఊళ్ళోని వాతావరణాన్నే వర్ణించాడు శ్యాం। కాని, నా మనస్సులో చిందులేస్తున్న ప్రేమ జల్లులా లేదు. పులకరింతల చినుకులు లేవు. కులుకుల జలతారు లేదు....మున్సిపాలిటీ కుళ్ళు కడిగేయటానికి రాలేదు నేను, వాళ్ళ కుళ్ళును బయట పెట్టటానికి వచ్చాను....అంటూ వూరి మీద పడిందిట వాన. మీ పథకాలు ప్లానులు ఎంత అవకతవగ్గా వున్నాయో చెపుతున్నా వినండి- అంటూ అధికారుల్ని హేళన చేస్తూ వచ్చి పడిందిట వాన. ప్రజల సొమ్ముని మీరిలాగే దోచుకొని జేబులు నింపుకుంటున్నారని కౌన్సిలర్సుతోటి కంట్రాక్టర్లు తోటి అంటోందిట వరద. మీ హక్కులేమిటో మీకు తెలియకుండా మీరిలాంటి అజ్ఞానంలో కొట్టుకుపోతున్నారని ప్రజలతో చెపుతోందిట వరద....

ఇదేమిటో లవ్ స్టోరీ కాకపోతే పోయె, యింత సీరియస్ సబ్జక్టులా వుందేమిటని అక్కడికా కథ ఆపేద్దామనుకున్నాను. కాని, తర్వాత పేరాలో అప్రయత్నంగా 'సుధ' అన్న పేరు చూసాను, ఒళ్ళు జివ్వు మంది. "ఎవరీ సుధ!" అన్నాను. నా వుద్దేశం....'సుధా రాణి పేరు గురించి ఇంకా నీకు చెప్పలేదుకదా....ఎలా వూహించావు?' అని।

"ఎవరేమిటి? ఓ అందమయిన అమ్మాయి. అంతే!" అని నవ్వి బాత్రూము వైపు వెళ్ళిపోయాడు శ్యాం.

శ్యాం సృష్టించిన సుధ అందాల రాణి. కాని, ఆమె అందచందాల వర్ణనలో పాఠకుడిని మత్తెక్కించే కైపు లేదు సరికదా.... గూఢార్థంతో చురుక్కు చురుక్కు మనిపించే వ్యంగ్యం వుంది. అలాంటి వర్ణన నాకు నచ్చకపోయినా సుధ పేరుంది కదాని తర్వాత కథ చదవసాగాను..

సుధ అర్జంటుగా షాపింగుకి వెళ్ళాలంది. వాన....వరద.... అనటానికి లేదు. ఆమె వెళ్ళాలంటే వెళ్ళాల్సిందే! కౌన్సిలుగారు తన గారాబు కూతురు ముద్దు తీర్చటానికి అంత వర్షంలోనూ కారుని బయలుదేరతీసాడు.... మెయిన్ రోడ్డు మీద డ్రెయినేజీపై కప్పు వేయటానికి, పెద్ద గోతులు తవ్వారు. రెండు వానా కాలాలు దాటినా వాటికా మోక్షంలేదు. మామూలప్పుడయితే రోడ్డుకి ఓ పెడనవున్న చిన్నరోడ్డు మీద కారులు, రిక్షాలూ పోతూ వుంటాయి. వానకి డ్రయినేజీ గోతులకి ఎడాపెడా వున్న మట్టిగుట్ట

కరిగి ఆ రోడ్డు మీద మోకాలి లోతు వూబి తయారయింది. కౌన్సిలరుగారి కారు వెళ్ళటానికి వీల్లేకుండా అంతకుముందే ఆ బురదలో యిరుక్కుపోయింది మరో కారు.

"ఇంకా ఎన్నాళ్ళకి ఈ డ్రయినేజీ పని పూర్తవుతుంది డాడీ?" అని విసుక్కుంది సుధ. ఈ పనికి ఎందుకింత కాలం పడుతుందో, ఇలాంటి మున్సిపాలిటీ పనులకి ఎందుకింతకాలం పట్టాలో....కౌన్సిలరుగారికి బాగా తెల్సు. అయినా ఆయన కూతురి ప్రశ్నకి జవాబు చెప్పలేదు. అలవోకగా నవ్వాడంతే! ఆ అమ్మాయి చిరాకులో 'మీ మున్సిపాలిటీవారి జోక్యంవల్ల ఎంతమంది యిబ్బంది పడిపోతున్నారో చూసావా నాన్నా!' అని బాధ వ్యక్తం చేస్తున్నట్టులేదు. తన షాపింగు ప్రోగ్రాము ఆగిపోయిందన్న కోప మెక్కుచే కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.

కూతురు కావాలంటే కొండమీద నుంచి కోతినికూడా దింపించి తెప్పించగల కౌన్సిలరుగారి కిదొక లెక్కా? ఎప్పుడో.... అప్పుడెప్పుడో ఎలక్షన్‌లప్పుడు యింటింటికీ ఓట్లడగటానికి ఒక్కసారి నేల మీద నడిచారాయన! అప్పుడు నడిచిన చిన్న రోడ్లు గుర్తొచ్చాయి. అటువైపు కారుని త్రిప్పాడు.

ఆ చిన్నరోడ్డుకి ఓ వైపు డాబా ఇళ్ళు.... రెండోవైపు కొంచెం పెడగా పూరికొంపలు వున్నాయి. 'అది గవర్నమెంట్ వారిస్థలమేనా?'- అని అడిగింది సుధ. కూతురు సూక్ష్మ బుద్ధికి మెచ్చుకోలుగా చూసి అవునన్నాడు కౌన్సిలరుగారు. 'మరి ఈ అలగా వెధవల్ని మన ఇళ్ళకి దగ్గరగా ఎలా వుండనిచ్చావ్ డాడీ?' ఇప్పటికిప్పుడు వాళ్ళ కొంపలు పీకించి వాళ్ళని వూరి బయటకు తరిమెయ్య- అన్నట్టు చూసింది సుధ. కౌన్సిలరుగారు మరోసారి నవ్వాడు. 'మన బట్టలుతికే వాళ్ళు, మనకి పాలు పోసేవాళ్ళు, మనకి కూర-నార తెచ్చేవాళ్ళు, చివరకి మనింటిలో మన అడుగులకి మడుగులొత్తే వాళ్ళంతా ఉండే చోటు ఇదేనమ్మా' అని సానుభూతితో నిండిన నవ్వు కాదది, 'రోడ్డు కివతల ఉన్న డాబా యిళ్ళవాళ్ళు కాదమ్మా- మనకు ఓట్లు వేసేది. అటువయిపున్న ఆ పూరికొంపలవాళ్ళే! వాళ్ళే మనకి బంగారు బాతులు' అని చెప్పినట్టు లౌక్యంగా నవ్విన నవ్వది. 'ఇంకెప్పుడూ నన్నిటు తీసుకురాకు' అని మరోసారి కసురుకుంది సుధ.

"ఛః అంత అందమైన అమ్మాయి అంత కరుగ్గా మాట్లాడుతుందా?" అన్నాను కథ చదవటం ఆపి.

ఎప్పుడు బాత్రూమునుంచి శ్యాం తిరిగి వచ్చాడో నేను గమనించ లేదు. "ఎక్కడిదాకాచదివావు?"అని అడిగాడు- చెప్పాను. "అంద మయిని అమ్మాయిలు కరుగ్గా మాట్లాడరని నీ కెవరు చెప్పారు?" అని అడిగాడు.

'మా సుధ అలా మాట్లాడదు....' అని నా నోటి చివరిదాకా వచ్చింది. "సుధ అని కాక మరేదయినా పేరు పెట్టాల్సింది!" అన్నాను. మా సుధ కౌన్సిలరుగారి కూతురూ కాదు. కారులో వెళ్ళే గొప్పింటిదీ కాదు. అయినా ఆ పేరు వాడి హీరో యిన్‌కి పెట్టటం మా సుధని వాడు చిన్నబుచ్చినట్టే అనిపించింది నాకు.

"మా వార్డు కౌన్సిలరుగారి కూతురి పేరు సుధ అవునో కాదో నాకు తెలియదు. కాని, నిన్న కారులో కూర్చున్న ఆ అమ్మాయి ముఖం చూసాక నాకా పేరే పెట్టాలనిపిం చింది. అందమయిన ముఖ మున్నంత మాత్రాన బుద్ధులు అం దంగా వుండాలని లేదు. పేరులో ఉన్నంత మాత్రాన మనసులో అమృ తం ఉండాలనీ లేదు. అందుకే వ్యంగ్యంగా సుధ- అని పేరు పెట్టాను" అన్నాడు శ్యాం.

నేను నివ్వెరపోయాను. "అంటే- నువ్వీ కథ నిజంగా చూసిందాని మీద వ్రాసావన్న మాట!"

"అవును. నిన్న మా కామరాజు యింటికి వెడుతూ దార్లో చూసాను. కొంతవరకు నిజం మరి కొంత.... కల్పన. "

ఉన్నట్టుండి కౌన్సిలరుగారి కారు టక్కున ఆగిపోయింది. ఆగిపోవ టమే కాదు, ఓ పక్కకి ఒరిగి పోయింది. సుధ కెవ్వున కేక పెట్టింది. కౌన్సిలరుగారు కారు దిగ టానికి ముందే పూరి గుడిసెల్లోంచి పదిమంది పరిగెత్తుకు వచ్చారు.

ఆయన అడక్కుండావే ఆ మురికి నీళ్ళల్లోకి దిగబడ్డాడు ఒకడు. కారు చక్రం ఎక్కడ ఇరుక్కుపోయిందో చూసి చెప్పాడు. ఆ వూళ్ళో మున్సి పాలిటీవాళ్ళ డ్రయినేజ్ స్కీము ఎంత అవక తవగ్గా, న త్తనడగా నడుస్తోందో చెప్పటానికి ఆ మేన్ హోల్ ఒక మచ్చు తునక! ఆ మధ్య ఎప్పుడో డ్రెయినేజీ వర్కర్సు వచ్చి ఆ రోడ్డుమీద కొంత పని చేసారు. అర్ధాంతరంగా

వదలి వెళ్ళిపోయారు. మేన్‌హోలు పైన కవరు వేయకుండా పోయారు. మున్సిపాలిటీవారి నిర్లక్ష్యాన్నే కాదు.... ఆ చుట్టుపక్కల వున్న ఇళ్ళవాళ్ళ అజాగ్రత్తని కూడా నిత్యం నోరు తెరచుకొని చాటుతోంది, ఆ మేన్ హోల్. అక్కడో గొయ్యి వుందని డాబాయిళ్ళ వాళ్ళూ, ఆ పూరి గుడిసెలవాళ్ళూ దాన్ని తప్పించుకుని పోవటానికి చూస్తున్నారే కాని.... ఏ నాడో, ఎవరో తప్పి జారి అందులో పడి, కాలో చెయ్యో విరక్కొట్టుకునే ప్రమాదముందని ముందు చూపుతో ఆ మేన్ హోలుకి కవరు వేయించే ప్రయత్నం చేయలేదు....

"అంటే, ఆ మేన్‌హోల్‌లో కారు చక్రం పడటం నువ్వు చూశావా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అంతే కాదు. ఆ బురద నీళ్ళల్లో కూరుకుపోయి ఆ కారుని బయటకు తీయాలని ముగ్గురు నానా అవస్థా పడుతుంటే.... వాళ్ళ కష్టంతో తనకేం సంబంధం లేనట్టు.... ఆ కారులో అలాగే కూర్చున్న ఆ యువరాణిని కూడ చూసాను! క్రింద కాలు పెడితే తన షోకు చెప్పులకి బురద అంటుకుంటుం దన్నట్టు అలాగే కారులో కూర్చుని వుందేకాని.... అయ్యో తన కోసం వాళ్ళు కష్టపడుతున్నారే! అలా కారులో కూర్చోవటం సంస్కారం కాదు- అన్న ఇంగితజ్ఞానం, మంచి భావం ఆమెలో కలిగినట్టు, ఆమె ముఖం నాకు చెప్పలేదు. ఆ క్షణంలో ఆమె మీదకంటే, ఆమెకు సాయం చేస్తున్న వాళ్ళ మీదనే నాకు ఎక్కువ అసహ్యం కల్గింది. అందుకినే, తర్వాత కథ అలా కల్పించి వ్రాసాను."

నేను తెల్లబోతూ చూసాను. చదవమన్నట్టు తల యెగరవేసాడు శ్యాం.

'తాము వుంటున్న యిళ్ళస్థలాలు తమకు స్వంతం చేస్తానని క్రితం ఎలక్షన్లప్పుడు వాగ్దానం చేసింది ఈ కౌన్సిలరుగారే! మున్సిపల్ అధికారు లొచ్చి లేచిపొండని హడల కొడుతున్నప్పుడల్లా వాళ్ళకి ముడుపులు చెల్లించుకుంటూ ఏ ఏటికాయేడు గండాలు గడుపుకు వస్తున్నారు తాము. తమ బ్రతుకులొక దారీ తెన్నూ లేకుండా పోవటానికి- ఈ దౌర్భాగ్యానికి ముఖ్య కారకుడు ఈయనగారే! తన నిర్లక్ష్యానికి.... తన లాంటి మున్సిపల్ అధికారుల దుర్మార్గానికి ప్రాయశ్చిత్తంగా మేన్ హోల్‌లో ఈయనకారు యిరు

క్కుంది. తగిన శాస్తి జరిగింది. ఇప్పుడు తన కారు ఎలా బయటకు తీసుకుంటాడో చూడాలి!....' అని ఎవ్వరూ పైకి అనలేదు. లోలోపలకూడా అనుకోలేదు. వాళ్ళెంత అజ్ఞానంధకారంలో ఉన్నారంటే కౌన్సిలరుగారు మరెవర్నయినా పిలిపించి, ఆ యినాము డబ్బులు ఇంకెవరికయినా ఇచ్చేస్తాడేమో అన్నంత ఆరాటంతో వచ్చి ఆ కారుని మేన్ హోల్లోంచి బయటకు తీసి పెట్టారు.... దానికి వాళ్ళకు దొరికిన ఇనాము ఏమిటి? కౌన్సిలరుగారి కూతురు దయతలచి విసిరిన ఒక్క చిరునవ్వు!

నా మనస్సు అదేదోలా అయిపోయింది. "నిజమా! కారు తీసి బయట పెట్టినందుకు ఆయన వాళ్ళకి డబ్బులేమీ యివ్వలేదూ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఇచ్చాడు. రెండు రూపాయలిచ్చాడు. కాని, కథలో వాళ్ళ దౌర్భాగ్యాన్ని మరింత హీనంగా చెప్పాలని కౌన్సిలరు ఏమీ యివ్వలేదని వ్రాసాను. ఇలాంటి ప్రజానాయకులు తమ అవసరాలు తీర్చుకుంటున్నప్పుడుకూడా ఆ దౌర్భాగ్యులకేదో మహోపకారం ఒరగపెడుతున్నట్టు దొంగ దొంగ దానాలు చేస్తారు. అది వాళ్ళ దాతృత్వం అని వాళ్ళు మురిసి యేడుస్తారేకాని దౌర్భాగ్యమని అనుకోరు. వాళ్ళమీదకి బురదనీళ్ళు చిమ్ముతూ, కౌన్సిలరుగారి కారు రంయ్‌మని వెళ్ళిపోయినప్పుడు వాళ్ళమీద నాకు జాలి వేయలేదు. ఆ రెండురూపాయలు వాళ్ళక్కడే బురద నీళ్ళల్లో పారేసి వుంటే నా కంత అసహ్యమేసేదే కాదు. నేనీ కథ రాసేవాడ్నీ కాదు...."

తర్వాత కథని శ్యాం ఎలా సాగించాడో అన్న కుతూహలంతో గబగబా చదివాను....

కూలివాడి కొడుకు కూలివాడే కావాలి. ఇలాగని ఏ శాస్త్రంలోనూ రాసి లేదు. కాని ఈ లోకంలో కనీసం ఈ దేశంలో ఇదే ఒక రివాజయిపోయిందని చెప్పటానికి గవరయ్య జీవితమే ఒక ఉదాహరణ....పిల్లలకి ఏడెనిమిదేళ్ళు వచ్చాయంటే ఎవరి రెక్కవాడిదే! ఆ రెక్క ఆడితే కాని, ఆ డొక్క ఆడదు. సమిష్టిగా ఒకే చోట పని చేయటానికి అందరికీ అవకాశముండవు. ఒక్కొక్కళ్ళు ఒక్కో చోట పని చేయాల్సి వస్తుంది! అంటే ఒంటరిగా వెళ్ళి ఒంటరిగానే అక్కడ సమర్థించు

కాని, తిరిగి ఒంటరిగానే యింటికి రా గలగాలి! అంతటి బాధ్యత తీసు కోవటం పసివయస్సులో అది గొప్పా? కాదు, గత్యంతరం లేక! చుక్కమ్మ పని ముగించుకొని ఇం టికి తిరిగి వస్తోంది. ఆ పూట యింటావిడ మరింత పని తగిలిం చింది. దాంతో చీకటి పడి పోయింది. దానికి తోడు వాన.... వరద కట్టి రోడ్లు కాలవలయి పోయాయి. ఆ దారి చుక్కమ్మకి అలవాటే. అయినా పాదాలు మాత్రం మునుగుతున్న ఆ కాల వలో తన మూడడుగుల పొడుగు శరీరాన్ని గటుక్కున మింగటానికి అక్కడో మేన్ హోల్ దాక్కుని వుందని మర్చిపోయింది. ఫలితం.. ఆమె వేసిన చావుకేక ఆ పూరిగుడి సెల వాళ్ళకి చేరలేదు- డాబాఇళ్ళల్లో వాళ్ళకి అందలేదు!....

"ఛ! ఏమిట్రా యీ కథ? నిష్కా రణంగా ఆ పిల్లని చంపేశావు?" అన్నాను నా మనస్సంతా ఏదోలా అయిపోయి.

"అయితే, అలా కాక ఎలా రాయా లంటావు?" అన్నాడు శ్యాం గంభీర స్వరంతో.

"ఇలా పెసిమిస్టిక్‌గా వ్రాయటం కన్నా...."

"తన కారు మేన్‌హోల్‌లో పడ గానే ఆ హీరోయిన్ బుద్ధి మార్చు కుందని, ఇప్పుడు తన కారుకే జరి గింది, రేపు ఇక్కడి మనుషులెవరి కయినా ప్రమాదం జరగవచ్చని తండ్రితో వాదించిందని.... ఆయన అమాంతంగా మంచివాడయిపోయి, మున్సిపలు వాళ్ళకి చెప్పాడని.... వాళ్ళు వెంటనే వచ్చేసి మేన్ హోల్ పైన కవరు వేసేసారని.... ఇలాగేనా వ్రాయమంటావు."

"రచయితలు కొందర్ని యిన్‌స్పై యిర్ చేయాలంటే ఆప్టిమిస్టిక్ అయిడియాలతో కథలు రాయాలి కాని.... పేదవాళ్ళని అసహ్యించు కుంటున్నారనిపించేలా- వాళ్ళ దౌర్భాగ్యాన్ని మరింత హీనాతి హీనంగా చూపించకూడదు!"

"ప్రొద్దున్న కామరాజింటికి వెడు తున్నప్పుడు ఆ సంఘటనచూసాను. సాయంత్రం ఇంటికి రాకుండా తిన్నగా అటే వెళ్ళాను. వరద నీళ్ళు తగ్గిపోయాక కవరులేని మేన్ హోల్ నోరు తెరచుకొని అదింకా కనిపిస్తూనే వుంది. ఇంకా ఆప్టి మిస్టిక్‌గా ఆలోచించమంటావా?.... నా ఆలోచన మాటటుంచి అలాంటి ప్రమాదమేదయినా నిజంగా జరిగితే తర్వాత ఏం జరుగుతుందో నువ్వే

ఆలోచించు!..పోయినవాళ్ళ గురించి ఉన్నవాళ్ళు ఏడవడమేకాని ఆ ప్రమాదానికి మన అజాగ్రత్తే కారణం అని వాళ్ళు గ్రహిస్తారా? అటు పూరియిళ్ళవాళ్ళేకాదు.... ఇటు డాబాయిళ్ళవాళ్ళు అంతే! ప్రమాదం ఎవరికయినా రావచ్చు. కాని, ఆ వీధిలో అటూ ఇటూ వున్నది వాళ్ళే. వాళ్ళే సమిష్టిగా ఆలోచించి ముందు జాగ్రత్త తీసుకుంటే అలాంటి ప్రమాదాలు ఎందుకు జరుగుతాయి? మున్సిపల్‌వాళ్ళు నిర్లక్ష్యంతో రాకపోతే పోయారు.... కనీసం, ఏ బల్లచెక్కో తెచ్చి వాళ్ళే ఆ గొయ్యి మీద కప్పవచ్చుగా! అది చేయరు. ఇక్కడ మన వూళ్ళో అది జరగలేదు. ప్రతివాడికీ కావల్సింది ఇండివిడ్యువల్ బెనిఫిట్స్! అంతేకాని మొత్తం కమ్యూనిటీ కంతకీ కల్సి వచ్చే లాభం గురించి ఎవ్వరూ ఆలోచించరు. ఇక మున్సిపాలిటీవాళ్ళు.... వాళ్ళకో లక్ష్యం లేదు. ఏదోకటి పీకల మీదకి వచ్చినప్పుడు నిద్రలేవటం. అంతే! మీ నిర్లక్ష్యం మూలంగానే ఒక నిండు ప్రాణం పోయిందని ఎవరయినా రాద్ధాంతం చేస్తే, అప్పుడు కాస్త కదుల్తారు- చచ్చినవాడి స్టేటసును బట్టి.... లేకపోతే అడిగేవాడి అరుపునుబట్టి కాంపెన్సేషను ఇస్తారు."

అంత బాధలోను నాకు నవ్వొచ్చింది.

"అవున్నా! ఏడవలేక నవ్వటంకాని.. మన చుట్టూ వున్న పరిస్థితులు ఏమాత్ర మయినా ఆప్టిమిస్టిక్‌గా ఉన్నాయా చెప్పు! ఆ మధ్య ఓ ఫారిన్ కంట్రీవాళ్ళు మీ దేశంలోని పేదపిల్లలకి తిండీ బట్టా ఏర్పాటు చేయటానికి కొన్ని లక్షలు డొనేట్ చేద్దామ నుకుంటున్నాము-పుచ్చుకుంటారా-అని మన అంబెసీవార్ని అడిగారు. మా గవర్నమెంటుని అడిగి చెపుతామన్నారు మన అంబెసీ వాళ్ళు. అక్కడ్నించి వుత్తరాలు రాసారు. ఇక్కడ ఫారెన్ మినిస్ట్రిలో కొన్నాళ్ళు, హోంమినిస్ట్రిలో కొన్నాళ్ళు ఫైనాన్స్ మినిస్ట్రిలో కొన్నాళ్ళు, ఆ కాగితాలు నిద్రపోయాయి. మీ డొనేషన్ పుచ్చుకోటానికి మా కభ్యంతరంలేదు....

అని మన గవర్నమెంటువాటు ఆ ఫారెన్ కంట్రీవాళ్ళకి జవాబిచ్చేసరికి రెండు సంవత్సరాలు పట్టింది. జవాబివ్వటానికే యింత జాప్యంచేసే మహానుభావులు ఆ పేదవాళ్ళమీద ఆ డబ్బు ఖర్చుపెట్టటాని కింకెంత ఆలస్యం చేస్తారో అని భయమేసి.. సారీ అని చెప్పి వూరుకున్నార్ట! మన దేశంలో ప్రజలకోసం గవర్న

మెంటు చేయించే పనులు ఎంత నత్త నడగ్గా నడుస్తున్నాయో ఇంక వేరే ఉదాహరణ చెప్పాలా?....”

“నిజమేననుకో! అయినా యిటు వంటి దౌర్భాగ్య స్థితిలో కూడా కొందరు మంచివాళ్ళున్నారు. మానవత్వం వున్నవాళ్ళున్నారు. నిజాయితీ వున్నవాళ్ళున్నారు. వాళ్లందబట్టే ఈ మాత్రమేనా దేశం నడుస్తోంది. లేకపోతే, ఎప్పుడో సర్వనాశనమయిపోయేది. నిజం కాదంటావా?”

“కావచ్చు. ఎక్కడో డార్క్ క్లౌడ్స్‌లో సిల్వర్ లైనింగులా చాల తక్కువమంది వున్నారు. అలాంటి వాళ్ళున్నారని మరి కొందర్ని యిన్స్‌పయిర్ చేసి రచయిత సంతృప్తిపడే రోజులు పోయాయి. ఇప్పుడు మొత్తం సొసయిటీనే నిద్రలెమ్మని చెప్పవల్సిన అవసరం వచ్చింది!.... ఎంప్లాయిస్ లంచాలు తింటున్నారని ఆఫీసర్లంటున్నారు. ఆఫీసర్లు లంచాలు తింటున్నారని పొలిటీషయన్సంటున్నారు. పొలిటీషియన్సు లంచాలు తింటున్నారని ప్రజలంటున్నారు. ఆ ప్రజలే.... అందరికీ లంచాలిస్తున్నారు. ఎవడికి వాడు డబ్బు పడేసి స్వంత పని చూసుకోవా లనుకోకుండా కల్సికట్టుగా వుంటే ఉమ్మడి లాభాలుంటాయి కదా? అప్పుడీ లంచాలు ఎవ్వరూ ఇవ్వవల్సిన పనేముంటుంది? ఇలాంటి ఆలోచనలు అందరికీ కలిగేలా చేయాల్సిన బాధ్యత రచయితలది. నీకు కలుగుతున్న నష్టమేమిటో చెపితేగాని, నువ్వు పొందకుండా జారిపోయిన లాభం గురించి నీకు స్పృహ రాదు! అందుకనే, ఆ కథలో అలాంటి ఆక్సిడెంట్ సృష్టించాను. అంతే కాదు-మున్సిపల్ అధికారులు ఇచ్చే కాంపెన్సేషన్‌లో ఏదో వంతు ఖర్చు పెడితే ఆ మేన్‌హోల్ పని ఎప్పుడో

---

ప్రఖ్యాత హిందీ ఫిలిమ్ కమిడియన్ మెహమూద్‌కి సారాయన్నా సారా తాగేవాళ్ళన్నా పరమ అసహ్యం. సారాను గురించి అతడి కామెంట్- “ఈ సారాయ మనేది దేముడు-ఎందుకు సృష్టించాడో తెలీదు. కానీ దాన్ని మూడు రకాల నెత్తుర్లతో సృష్టించాడు. మొదటిది సింహం నెత్తురు. రెండవది నక్క నెత్తురు, మూడవది పంది నెత్తురు. ఎలాగంటే-మొదటి పెగ్గు వేసుకొన్నవాడు- సింహం లాగా గంభీరంగా భయం కొల్పిస్తుంటాడు. రెండో పెగ్గు వేసుకొన్నవాడు- నక్కలాగా దొంగ చూపులు చూస్తూ దాక్కోవడానికి ప్రయత్నిస్తుంటాడు. పూర్తి మూడో పెగ్గు లాగేసినవాడు- పంది లాగా రోడ్లమీద దొర్లుతుంటాడు.”

—సురాశర్మ.

అయిపోయేది కదా? అలాకాక ఇంత డబ్బు ఖర్చు పెట్టటానికి కారణం ఏమిటి? తన నిర్లక్ష్యానికి పాపపరిహారం చేస్తున్నట్టు కని పించే ఆ డబ్బు ఎవరిది? అది మాత్రం ప్రజల డబ్బు కాదా? ఈ నిజాన్ని ప్రజలు ఎప్పుడు గుర్తి స్తారు? ప్రజల హక్కుల గురించి వాళ్ళకి తెలియడానికి ఇంకా ఎన్ని ప్రమాదాలు జరగాలి? ఇంకా అధికారుల నిర్లక్ష్యం ఎంతకు పెర గాలి? నాయకుల అరాచకాలు ఎలాంటి పరాకాష్ఠను చేరుకోవాలి? చెప్పు- నేనీ కథ ఇలాకాక ఎలా రాయాలి?"

ఈ సీరియస్‌నెస్‌తోటే అర్ధరాత్రి వరకు కూర్చుని ఈ కథ వ్రాసుం టాడు. ఆ అలసటతోటే జ్వరం వచ్చి వుంటుంది. శ్యాంబాబు మీద వాత్సల్యంతో నా గుండె నిండింది. ఆ క్షణంలో నేను నా సుధారాణినీ, నా ప్రేమ కథనీ అన్నిటినీ మర్చి పోయాను. ఎంతో ఎత్తుకు ఎదిగిన వాడి వ్యక్తిత్వాన్ని తిలకిస్తూ ముగ్ధు డినయి అలాగే వుండిపోయాను.

"హలో! ఏమిటిద్దరూ అలా సీరి యస్‌గా కూర్చుండిపోయారు?" అంటూ శ్యాంబాబు కొలీగ్ కామ రాజు లోపలికి వచ్చేసరికి ఉలిక్కి పడి స్పృహలోకి వచ్చాను.

అతనికా సీరియస్ టాపిక్ గురించి చెప్పటం ఎందుకని "సరదాగా ఏదయినా పిక్చర్‌కి తీసుకు వెడదా మని వచ్చానండి: వీడు కాస్తా జ్వరం తెచ్చి కూర్చున్నాడు" అని నవ్వాను.

"అన్నట్టు మాణిక్యం మీ పని మనిషి కదూ?" అన్నాడు కామరాజు ఏదో గుర్తు తెచ్చుకుంటూ.

"అవునండి! ఈ పూట ఎందుకో పనిలోకి రాలేదు. ఏం అలా అడి గారు?"

"అయితే, ఏం జరిగిందో మీ కింకా తెలియదన్న మాట!"

నా గుండెలెందుకో గుభేల్మన్నాయి.

"ఏం జరిగింది?"

"దాని కొడుకు వెంకడు లేడూ? వాడు నిన్న రాత్రి పనికి వెళ్ళి ఇం టికి వస్తున్నాట్టండీ! చీకట్లో నీళ్ళల్లో పాపం తెలియలేదుకాబోలు! మేన్‌హోల్‌లో పడిపోయాడట."

ఆ పైన కామరాజు మాటలు నాకు వినిపించలేదు. చెవులు హోరెత్తి పోయాయి. చటుక్కున శ్యాంబాబు వైపు చూశాను. వాడి కళ్ళు టీపాయ్‌మీద ఫేన్‌గాలికి రెపరెప లాడుతున్న కాగితాలమీదవున్నాయి. వాడి కళ్ళల్లో నీళ్ళు ఎర్రగా వున్నాయి.

నా గొంతు పిడచ గట్టినట్టయింది! *